నేడు 'అన్నదాత పోరు'

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

నరసన్నపేట: ఎరువుల కొరత, బ్లాక్ మార్కెట్‌పై శ్రీకాకుళం, టెక్కలి, ఆర్‌డిఒ కేంద్రాల వద్ద ఆందోళనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నా అనంతరం ఆర్‌డిఒలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో రైతులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఆందోళనల ఉద్దేశమని తెలిపారు.

కెజిబివిలకు పెరిగిన క్రేజ్

- సీటు వస్తే భవిష్యత్ ఉంటుందనే భావనలో తల్లిదండ్రులు
- చదువు, భద్రతకు భరోసా ఉండడంతో ఆకర్షితులవుతున్న వైనం
- సీట్ల కోసం విపరీతమైన డిమాండ్ నెలకొన్న వైనం
- ఐదు మండలాల్లో కెజిబివిలు లేక అవకాశం కోల్పోతున్న విద్యార్థినులు

కస్తూరిబా గాంధీ విద్యాలయాలు (కెజిబివి)... ఆడపిల్లల్లో డ్రాపౌట్స్‌ను తగ్గించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కేంద్రాలు. ఒకప్పుడు ప్రవేశాల కోసం కోసం అధికారులు, సిబ్బంది ఊరూరా తిరగాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. ఇప్పుడు అక్కడ సీటు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినా సీటు రాని పరిస్థితి నెలకొంది. విద్యాలయాల్లో చేరితే కనీసం పాస్ గ్యారంటీ అనే ప్రచారం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువు కోసం రూ.వేలల్లో ఖర్చు పెట్టాల్సిన ప్రస్తుత రోజుల్లో పైసా ఖర్చు లేకుండా అంతకుమించిన విద్యా బోధన, బాలికలకు మంచి భద్రత ఉండడంతో అంతా ఇటువైపు ఆకర్షితులవుతున్నారు. దీంతో కెజిబివిల్లో సీట్ల కోసం విపరీతమైన డిమాండ్ నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పొందూరు

జిల్లాలో 25 కెజిబివిలు ఉన్నాయి. వాటిలో 6,900 సీట్లు భర్తీ అయ్యాయి. కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు పుట్టగొడుగుల్లా రావడంతో ఇంటర్‌లో ప్రవేశాలకు పెద్దగా డిమాండ్ లేకున్నా, ఆరు నుంచి పదో తరగతి వరకు సీట్ల కోసం విపరీతమైన క్రేజ్ నెలకొంది. అందుకు కారణాలు లేకపోలేదు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా బోధన ఉంటుందన్న ప్రచారం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లింది. కెజిబివిల్లో పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణతాపరంగా మంచి ఫలితాలు వస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అంతా ఆకర్షితులవుతున్నారు. చదువు, ఆడపిల్లల భద్రత, మంచి పోషకాహారం, ఇతర వసతి సౌకర్యాలు బాగా ఉండడంతో మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి ఏదోరకంగా సిఫార్సు లేఖలు పొంది సీట్ల కోసం పరితపిస్తున్న పరిస్థితి నెలకొంది.



పొందూరు మండలం లోలుగులోని కెజిబివి

బాలికల భద్రతకు భరోసా

కెజిబివిల్లో చేర్పిస్తే తమ పిల్లల భద్రతకు భరోసాగా ఉంటుందన్న నమ్మకం తల్లిదండ్రుల్లో బలంగా ఉంది. ఇంటి నుంచి పాఠశాల, కళాశాలకు వెళ్లే సమయంలో ఎవరైనా వేధిస్తారనే భయం లేకపోవడంతో స్వేచ్ఛగా తమ పిల్లలను చేర్పిస్తున్నారు. అదీ మహిళా ప్రిన్సిపాళ్ల పర్యవేక్షణలో ఉండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ధైర్యంగా అందులో చేర్పిస్తున్నారు. దీంతోపాటు ఎపిసి నుంచి సెక్టోరల్ అధికారులు, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ తదితర అధికారులు బోధన అంశాల నుంచి మెనూ వరకు అన్ని విషయాలపై నిరంతరం పర్యవేక్షిస్తుండడంతో విద్యార్థినుల చదువు సాఫీగా సాగడానికి దోహదపడుతోంది.

ఆ మండలాల్లో కెజిబివిల ఏర్పాటు ఎప్పుడో?

జిల్లాలో 30 మండలాలు ఉండగా, 25 మండలాల్లోనే కెజిబివిలు ఉన్నాయి. టెక్కలి, పలాస, వజ్రపుకొత్తూరు, సరుబుజ్జిలి, నరసన్నపేట మండలాల్లో కెజిబివిలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన విద్యార్థినులకు కెజిబివిల్లో చదువుకునే అవకాశం లేకుండా పోయింది. సీట్ల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు ఎడాపెడా సిఫార్సు లేఖలు ఇస్తుండడంతో సర్దుబాటు చేయడం అధికారులకు తలనొప్పిగా మారింది. తరగతికి 40 సీట్లు మాత్రమే ఉండడం, అంతకుమించి అకామిడేషన్ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఆయా మండలాల్లో కెజిబివిల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తే, సమస్య తీరుతుందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

బైపిసిలో 433 మార్కులు తెచ్చుకున్నా...



మా తల్లిదండ్రులు టైలరింగ్ చేస్తూ అనకాపల్లిలో ఉంటున్నారు. ఇక్కడి కెజిబివి పాఠశాలలో బాగా చెబుతున్నారని గ్రామానికి చెందిన స్నేహితులు చెప్పడంతో జాయిన్ అయ్యాను. సిలబస్‌తో పాటు నీట్ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయినుల మంచి బోధనతో బైసిపి మొదటి సంవత్సరం 440కి 433 మార్కులను సాధించాను.

- గేదెల జ్యోత్స్న, లైదాం, పొందూరు

అక్కా చెల్లెళ్లం ఇక్కడే చదువుకుంటున్నాం



మా తల్లిదండ్రులు తాపీ పని చేస్తుంటారు. ఇదే పాఠశాలలో మా అక్క కూడా పదోతరగతి చదువుతుండడంతో నన్ను కూడా జాయిన్ చేశారు. ఇక్కడైతే భద్రత ఉంటుందని చేర్పించారు. విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. భోజన, వసతి కూడా బాగుంది.

- ఐ.రిషిత, పెనుబర్తి, పొందూరు

సిఫార్సులు ఉన్నా సీట్లు ఇవ్వలేకపోతున్నాం



ఒకప్పుడు కేవలం డ్రాపౌట్స్ కోసం ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలు ఇప్పుడు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలను సాధిస్తున్నాయి. గతంలో గ్రామాల్లో తిరిగి విద్యార్థినులను చేర్పించాలని కోరేవాళ్లం. ఇప్పుడు ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేస్తున్నా, సీట్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. కెజిబివిల్లో మంచి బోధన, ఆడపిల్లలకు భద్రత ఉంటుందని తల్లిదండ్రులు బలంగా నమ్మడం వల్లే ప్రవేశాలకు డిమాండ్ ఏర్పడింది.

- లలితకుమారి, ప్రిన్సిపాల్, లోలుగు కెజిబివి

మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతాం



కెజిబివిలను మరింత ఉన్నంతగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. పది, ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. కెజిబివిలపై నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నాం. విద్యాలయాల్లో పాఠ్యాంశాలు అకడమిక్ కేలండర్ ప్రకారం అమలు, పరీక్షలు, మెనూతో పాటు విద్యార్థినుల హెల్త్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. అందరి సహకారంతో కెజిబివిలను ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తాం.

- ఎస్.శశిభూషణ్, ఎపిసి, సమగ్ర శిక్ష

ఎరువులు సీజ్



ఎరువులను సీజ్ చేస్తున్న అధికారులు

కంచిలి : మండలంలోని డి.జి.పురంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులను ఫెర్టిలైజర్ మండల విజిలెన్స్ కమిటీ అధికారులు సోమవారం సీజ్ చేశారు. అక్రమంగా ఎరువులు నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు కమిటీ సభ్యులైన ఎస్ఐ పారినాయుడు, తహశీల్దార్ రమేష్ కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రస్వామి, ఎఒ కె.సురేష్ సోదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇంట్లో 18 బస్తాల యూరియా, 10 బస్తాల ఆర్గానిక్ ఎరువులు, 17 బస్తాల కాంప్లెక్స్ ఎరువులు, ఐదు గ్రోమోర్ బస్తాలు, 25 కిలోల పొటాష్ బస్తాలు అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అరవసరియాపల్లికి చెందిన ముగ్గురు రైతులు కొనుగోలు చేసి వస్తుండగా, వారి వద్ద నుంచి లభించిన సమాచారం మేరకు ఈ సోదాలు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. యూరియాన్ సీజ్ చేసి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా నిల్వ ఉంచిన ఎరువులు తన వ్యవసాయం కోసం తెచ్చినవని, వాటికి సంబంధించిన బిల్లులన్నీ తన వద్ద ఉన్నాయని సంబంధిత వ్యక్తి తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఎరువుల గురించి ఆందోళన వద్దు

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎరువుల గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం తండేంవలసలోని రైతు సేవా కేంద్రంలో ఎరువుల పంపిణీని సోమవారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో 23 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, త్వరలో మరో మూడు వేల మెట్రిక్ టన్నులు రానున్నాయని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌కు కూడా రాష్ట్రానికి 9.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేటాయించడానికి కేంద్రం అంగీకరించిందన్నారు. వరి పంటకు మూడుసార్లు, ఒక్కసారి ఎకరాకు 25 కిలోలకు మించి యూరియా వేయకూడదని తెలిపారు. అధికంగా వాడితే ఆరోగ్యపరమైన ప్రమాదాలు ఉంటాయని చెప్పారు. నానో యూరియాను వాడాలని, ముఖ్యంగా రెండో దశలో దీన్ని ఉపయోగించాలని సూచించారు. ప్రైవేట్ డీలర్లు ఎరువులతో పాటు ఇతర వస్తువులను బలవంతంగా అమ్మడానికి ప్రయత్నిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి, తహశీల్దార్ గణపతి, ఎంపిడిఒ శైలజ, సర్పంచ్ కూర్మారావు పాల్గొన్నారు.

'రణభేరి జాతా'ను విజయవంతం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్

ప్రజాశక్తి- పలాస

పాఠశాలల విద్యారంగ, ఆర్థికపరమైన సమస్యలపై ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించనున్న రణభేరి జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జిల్లా కార్యదర్శి కె.రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటీ పరిష్కరించలేదన్నారు. ప్రధానంగా ఆర్థిక విద్యారంగ సమస్యల పరిష్కారం కాకపోగా, మరింత జటిలంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు బదిలీలు, ఉద్యోగోన్నతులు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా... ఇంకా పాత స్థానాల్లో కొనసాగుతున్నారని అన్నారు. అన్నారు. మూడు నెలలుగా ఎంటిఎస్ ఉపాధ్యాయులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా ప్రపంచ బ్యాంకు సాల్ట్ పథకం అమలు చేయడం ద్వారా ప్రభుత్వ విద్య వ్యవస్థ మరింత బలహీనపడుతుందన్నారు. మూడో వంతు ప్రైమరీ పాఠశాలలు సింగిల్ టీచర్ల స్కూల్‌గా మారిపోయాయ అన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు పరిమితం చేయడం దారుణమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

విద్యార్థులకు నాలుగు అక్షరాలు చెప్పాలనే విధంగా కాకుండా ఆన్‌లైన్ అపోలోడింగ్ కార్యక్రమాలు నిర్వహించడం సరికాదన్నారు. పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలన్నారు. 57 మెమో ప్రాప్తికి 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, రాష్ట్ర కౌన్సిలర్లు గుంట కోదండరావు, బల్ల చిట్టిబాబు, జిల్లా అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎల్.వెంకటాచలం, పలాస, వజ్రపుకొత్తూరు, మందస అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేన జయరాం, ఎస్.వి.రమణ, జె.జయరాం, డి.ఈశ్వరరావు, ప్రసాదరావు, గొండు మధు, మాధవరావు పాల్గొన్నారు.

ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి

- రూ.30 వేల భృతి చెల్లించాలి
- 11న కలెక్టరేట్, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ, సరుబుజ్జిలి

ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతూ శ్రీకాకుళం నగరంలోని జిల్లాపరిషత్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో డిప్యూటీ కలెక్టర్ పద్మావతికి సిఐటియు నాయకులు తేజేశ్వరరావు, ఆర్.ప్రకాశరావు, ఆటో డ్రైవర్లు వినతిపత్రం అందజేశారు. సరుబుజ్జిలి సరుబుజ్జిలి జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో సిఐటియు నాయకులు అమ్మన్నాయుడు, నాగమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి నష్టపోతున్న ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం ఏటా రూ.30 వేలు చొప్పున భృతి ఇచ్చి ఆదుకోవాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యపై సెప్టెంబరు 11 న శ్రీకాకుళం కలెక్టరేట్, టెక్కలి, పలాస ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లకు కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం ఆదుకోకపోవడం అన్యాయమన్నారు. నిరుద్యోగ సమస్య వల్ల ప్రైవేట్ ఫైనాన్సర్ల దగ్గర అధిక వడ్డీలకు అప్పులతో ఆటోలను కొనుగోలు చేసి ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. డ్రైవర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోలు, వాహన విడిభాగాలు, ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు, ఆర్‌టిఎ చలానాలు.. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో రోజంతా ఆటో, వ్యానులు నడిపినా పూట గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణకు అప్పులు చేస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డ్రైవర్లకు భారమైన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, టోల్ ఫీజులు 30 శాతానికి తగ్గించాలని, డీజిల్, పెట్రోల్‌పై ఉన్న వ్యాట్, సెస్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పన్నులు తగ్గించాలని, వాహన విడి భాగాల ధరలపై వేస్తున్న జిఎస్‌టి, వ్యాట్, సెస్ పన్నులు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీ సూర్య ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎల్.సింహాచలం, వి.సురేష్, అంబేద్కర్ యూనియన్ నాయకులు ఎ సంతోష్, ముద్దాడ అసిరితల్లి యూనియన్ నాయకులు ఎం.రామారావు, పి.అప్పారావు, సిఐటియు నాయకులు రాజు, గోపాల్, సుశీల, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

వైభవంగా కొత్తమ్మతల్లి జాతర నిర్వహణ

మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కోటబొమ్మాళిలో కొలువైన కొత్తమ్మ తల్లి జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండగగా గుర్తించిన నేపథ్యంలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రముఖ ఆలయాల తరహాలో క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉచిత దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు. శోభాయాత్ర, గ్రామీణ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎగ్జిబిషన్, ఫైర్ వర్క్స్, హెలికాప్టర్ రైడింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రోజూ 25 వేల మందికి అన్నదానం నిర్వహించాలని సూచించారు. చిన్న పిల్లలకు పాలు, యాత్రికులకు మంచినీరు అందించాన్నారు. జాతరలో నిర్బంధ వసూళ్లు జరగకుండా దేవాదాయ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ జాతర విజయవంతం కావడానికి విభాగాల వారీగా అధికారులకు బాధ్యతలు కేటాయించినట్లు వివరించారు. మొత్తం కార్యక్రమానికి టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తిని ఇన్‌ఛార్జిగా నియమించామని, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ బాధ్యతలు టెక్కలి ఎస్‌డిపిఒకు అప్పగించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరిప్రసాద్, బోయిన రమేష్ పాల్గొన్నారు.

గౌరవ వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో ముస్లిములకు ఇస్తున్న ఇమామ్, మౌజ్జన్ గౌరవ వేతనం బకాయిలు చెల్లించాలని మైనారిటీ కమిటీ సభ్యులు కోరారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మీకోసం ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్‌ఖాన్, అధికారులు వినతలు స్వీకరించారు. మసీదుల నిర్వహణఖు ఇమామ్లకు రూ.10 వేలు, మౌజ్జన్ రూ.5 వేలు ప్రభుత్వం నెలకు అందజేసేదని అన్నారు. గత 8 నెలలుగా అందజేయడం లేదని అన్నారు. మసీదుల నిర్వహణకు నెలకు రూ.5 వేలు అందజేశారని, అదీ అందడం లేదని తెలిపారు.

పొందూరు మండలం నీలంపేటలో ఎత్తిపోతల పథకం నిర్మించాలని వైసిపి ఆముదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఫిర్యాదు చేశారు. 800 ఎకరాలు సాగులోకి అందుతుందని చెప్పారు. ఆముదాలవలస నియోజకవర్గంలో యూరియా కొరత వెంటాడుతుందని, సమస్య పరిష్కరించాలని కోరారు. అదే మండలం పొన్నంపేట గ్రామస్తులు ప్రస్తుత శ్మశానం మార్పు చేయాలని కొందరు చూస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులు వస్తాయని అన్నారు. పాత స్థలంలో శ్మశానం కొనసాగించాలని స్థానికులు కోరారు.

సారవకోట మండలం చిన్నకిట్టాలపాడు పంచాయితీ బొంతుగూడ గిరిజనులు 25 ఏళ్లగా నివసిస్తున్నారని, ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని ఫిర్యాదు చేశారు. గ్రామంలో కనీస మౌలిక వసతులు లేవని, తమ సమస్య పరిష్కరించాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంలో స్థానిక వైశాకి బయోటెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కారణంగా భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, ప్రభుత్వం స్పందించి శుద్ధి జలాల ప్లాంట్ ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ మూగి శ్రీరాములు కోరారు. పరిశ్రమ అరకొర తాగునీరు అందిస్తుందన్నారు. పరిశ్రమ వల్ల కాలుష్య బాధిత ప్రాంతానికి తాగునీరు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎచ్చెర్లలో పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పల్లవాని చెరువు భూగర్భం ఆక్రమణకు గురవుతుందని అనకాపల్లి శ్రీరాములు ఫిర్యాదు చేశారు. జిల్లా పశు సంవర్ధకశాఖలో ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారని ఎచ్చెర్లకు చెందిన ఇనప రాజారావు ఫిర్యాదు చేశారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ భూముల ఆక్రమణకు గురవుతున్నాయని, హద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు చేశారు.

మీకోసంకు మొత్తం 75 పిర్యాదులు వచ్చాయి. సమస్యలు పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని జెసి సూచించారు. కార్యక్రమంలో ఉప ప్రత్యేక కలెక్టర్ పద్మావతి, డిప్యూటీ కలెక్టర్ టి.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని 25 గొర్రెలు మృతి

మరో పది గొర్రెలకు గాయాలు

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీసు స్టేషన్ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారి పైడిభీమవరం సమీపంలో సోమవారం లారీ ఢీకొని మండలంలోని సీతంవలసకు చెందిన పిట్ట రమణకు చెందిన 25 గొర్రెలు సంఘటనా స్థలంలో మృతి చెందగా, మరో పది గొర్రెలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... సోమవారం వేకుమజామున 4 గంటల సమయంలో చిన్నపాటి వర్షం కురిసింది. ఆ సమయంలో పొలంలో నుంచి మెట్ట ప్రాంతానికి గొర్రెలను రోడ్డు దాటిస్తున్నాడు. అదే సమయంలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళున్న గుర్తు తెలియని లారీ అతివేగంగా వ్చ్చి గొర్రెలపై నుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో 25 గొర్రెలు మృతి చెందారు. మృతి చెందిన గొర్రెలు రోడ్డుపై చెల్లాచెదురయ్యాయి. మృతి చెందిన గొర్రెలను చూసి గొర్రెల కాపకరి రమణ కన్నీటిపర్యంతమయ్యారు. ఎన్నో రోజులుగా కంటికి రెప్పలా కాసుకుని వస్తున్నాని, ఈ విధంగా రోడ్డు ప్రమాదంలో గొర్రెలు మృతి చెందడంతో బోరున విలపిస్తున్నారు. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని అన్నారు. పొట్టకూటి కోసం గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్న వారికి ఈ ప్రమాదం తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగించింది. ఈ సమాచారం అందుకున్న స్థానిక ఎఎస్ఐ ఎన్.ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గుర్తు తెలియని లారీని పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు. రమణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గొర్రెలు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి బాధితుడు పిట్ట రమణను పరామర్శించారు. ప్రభుత్వం స్పందించి బాధితుడికి నష్టపరిహారం అందించాలని కోరారు.



సమస్యను వింటున్న ఎస్పి మహేశ్వరరెడ్డి

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో స్వీకరించే అర్జీలను పునరావృతం కాకుండా ఆయా ఫిర్యాదులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వృద్ధులు, దివ్యాంగుల వద్దకు ఎస్పి స్వయంగా వెళ్లి వారి అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదులను వివరంగా అడిగి తెలుసుకుని విచారణ జరిపి, సత్వరం పరిష్కరించాలని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. తీసుకున్న పరిష్కార చర్యలు, పూర్తి వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు వివిధ రకాల పోటీలు దోహదపడతాయని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. వారధి ఫౌండేషన్ ఆధ్వర్యాన మండలస్థాయి వ్యాసరచన, డిబేట్ పోటీలు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీల్లో వ్యాసరచన విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేట విద్యార్థులు పి.మురహరి, ఆర్.చరణ్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. డిబేట్‌లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.ఢిల్లేశ్వరి, పి.కీర్తి, బి.ఆశ్రిత ప్రథమ స్థానం పొందారు. వీరు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఇఒ తెలిపారు. అనంతరం ఎంఇఒ, ప్రధానోపాధ్యాయుడు ఎన్.విశ్వనాథం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక శ్రీనివాసరావు, రామచంద్రరావు, గంగయ్య, మొర్రి గోపి, ఐఇఆర్‌పి లమ్మత కృష్ణారావు, సిఆర్‌ఎంటి పి.హేమారావు తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్యులు, సిబ్బంది

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

శ్రీకాకుళం: జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జెమ్స్ మెడికల్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన మెడికల్ డైరెక్టర్ డా. ఎ.హేమంత్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారి మరణానంతరం నేత్రదానం చేయడాన్ని ఒక సంప్రదాయంగా మలచాలని ఆకాంక్షించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డా.ఎస్.పుష్పలత మాట్లాడుతూ విద్యార్థులు నేత్రదానంపై అవగాహన కలిగి ఉండడమే కాకుండా, తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం ఆవశ్యకతను వివరించి, వారిని ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం, ఆమె విద్యార్థులచే నేత్రదాన ప్రతిజ్ఞ చేయించారు. జెమ్స్ నేత్ర విభాగాధిపతి డా. సతివాడ లక్ష్మీ విద్యార్థులకు నేత్రదాన ప్రక్రియ, ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా. ఎస్.శ్రీనాథ్ రెడ్డి, జనరల్ మేనేజర్ డా. డి. ప్రవీణ్, డిజిఎం ఎస్.విజయభాస్కరరావు, సిబ్బందితో పాటు వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఎంసి చైర్మన్‌కు అభినందనలు



పద్మ దంపతులను అభినందిస్తున్న దేవాంగ సంఘం సభ్యులు

లావేరు: ఎచ్చెర్ల ఎఎంసి చైర్మన్‌గా నూతనంగా నియా మకమైన లావేరుకు చెందిన నిడిగంట్ల పద్మను సోమ వారం లావేరు గ్రామ దేవాంగ సంఘం సభ్యులు దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మాని ంచారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బాసిన గౌరీ, హరనాథ్, ఉప్పు వీర్రాజు, నల్ల అప్పారావు, కనకం ప్రసాద్, కొండక ప్రసాద్, వి.సత్యం, నల్ల నాగరాజు, జీవానందం తదితరులున్నారు.

యూరియా వినియోగంపై అవగాహన



నరసన్నపేట : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

రైతులు సమయానుకూలంగా ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడి వస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎరువుల వినియోగం, పంపిణీపై అవగాహన కల్పించేందుకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రైతుల సమక్షంలో అవగాహన కల్పించారు. వినియోగ విధానం, సరఫరా పద్ధతులపై సూచనలు అందించారు. తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ రామారావు, ఎఒ అజయ్‌కుమార్ మాట్లాడారు. ఎరువుల శాస్త్రీయ వినియోగం, అధిక మోతాదులో వాడకం వల్ల కలిగే నష్టాలు, సమయానుకూలంగా వేసినప్పుడు పంట దిగుబడి పెరుగుదల వంటి అంశాలను వివరించారు. అలాగే ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, రైతులకు అందుబాటులో ఉంచిన ఎరువుల పంపిణీ విధానాలపై తెలియజేశారు.

నరసన్నపేట : రైతులకు సకాలంలో యూరియా ప్రభుత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మండలంలోని కరగాం రైతు సేవా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎరువుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఇతర దేశాలతో జరిగిన స్వల్ప వివాదాలతో యూరియా మన దేశానికి, రాష్ట్రానికి రావడంలో జాప్యం ఏర్పడిందని వివరించారు. ఈ క్రమంలోనే యూరియా అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని అన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడి ఎల్.వి.మధు, తహశీల్దార్ సత్యనారాయణ, పోలాకి పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, సర్పంచ్ పంగ బాబాజీనాయుడు, నీటి సంఘం అధ్యక్షులు శిమ్మ లక్ష్మణరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాధు ఆనంద్, పీస మోహన్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: యూరియా సమయానికి సరైనా మోతాదులో వాడడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ తెలిపారు. మండలంలో తులసిగాం రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు యూరియా వాడకంపై సోమవారం అవగాహన కల్పించారు. అధిక మోతాదులో యూరియా వాడటం వల్ల పంటలకు, నేలకు కలిగే ప్రతికూల ప్రభావాలు గురించి వివరించారు. మోతాదులో యూరియా వాడకం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియాను సమృద్ధిగా అందుబాటులో ఉందన్నారు. రైతు తన భూమి పరిస్థితులు, పంట అవసరాలకు అనుగుణంగా యూరియాను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నానో యూరియా ప్రయోజనాలు కూడా వివరించారు. ఈ కార్యక్రమం లో రైతులు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలో రైతులకు సరఫర చేసేందుకు 39 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకర్ తెలిపారు. మండలంలోని మామిడిపల్లి, తాళ్లభద్ర, పలాసపురం రైతు సేవా కేంద్రాలను తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎఒ బి.నరసింహమూర్తితో కలిసి సందర్శించారు.

కోటబొమ్మాళి: మండలం జీయన్నపేటలో ఎపిఎం జి.హరిప్రసాద్ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి రాంబాబు, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని రైతులకు మరో 48 గంటల్లో ఎరువుల ప్రభుత్వం అందిస్తుందని టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు విలేకరులతో మాట్లాడారు. వైసిపి నాయకులు రైతులను తప్పుదోవ పట్టించేందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎరువులు అందించేందుకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన వెంట వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బాలకృష్ణ ఉన్నారు.

పలాస : ఎరువుల కొరత లేకుండా చూస్తున్నామని తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, వ్యవసాయశాఖ ఎడిఎ ఎం.రామారావు, ఎఒ పోలారావు అన్నారు. మండలంలోని మాకన్నపల్లి, బొడ్డపాడు, అల్లుకోల రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.దుర్గారావు, కిక్కర ఢిల్లీరావు, విఆర్‌ఒలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని బాతుపురంలో స్వయం సహాయ సంఘాల సభ్యులకు యూరియా సరఫరా, వినియోగంపై సెర్ప్ ఎపిఎం గొడబ ప్రసాదరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బత్తిన హేమ, స్వాతి, పద్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విప్ అశోక్

లావేరు: రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని, సరిపడా యూరియా ఉందని తహశీల్దార్ జివిఎస్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం తాళ్లవలస, అప్పాపురం గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో రైతులకు యూరియా కోసం కూపన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాళ్లవలస రైతుసేవా కేంద్రంలో 220 బస్తాలు అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకటరాజు, మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహనరావు, సొసైటీ సంఘం అధ్యక్షుడు ముప్పిడి శ్రీనివాసరావు, ఎపిఎం బి.వి సుబ్బయ్యనాయుడు, దారపురెడ్డి కూర్మరావు, విఎఎ తాలాడ లక్ష్మణరావు, రైతులు మొంగం మల్లీశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: ఖరీఫ్ వరి సాగు చేసే రైతులు ఎరువులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయి ప్రత్యూష అన్నారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో ఆమె తహశీల్దార్ ఎల్.మధుసూదన్ ఆధ్వర్యంలో రైతులతో సమీక్ష నిర్వహించారు. ప్రైవేటు దుకాణాల్లో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆర్‌డిఒ దృష్టికి తీసుకురాగా అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఎం కె. గోవిందరావు, డిటి జగదీష్, టిడిపి నాయకులు దవళ సింహాచలం, ఎండ రామారావు, కొమనాపల్లి రవికుమార్, ఇల్లాకుల ప్రభాకర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

28న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

సోంపేట: మండలంలోని ఎర్రముక్కాము ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 28న వే టూ సక్సెస్ సంస్థ 8వ వార్షికోత్సవ సందర్భంగా రాష్ట్రస్థాయి ఓపెన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్. దామోదరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్విజ్ పోటీలో పాల్గొనే సభ్యులు ఫారానికి నింపి ఈ నెల 27 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని క్విజ్ కన్వీనర్ బి.మురళి తెలిపారు. ప్రథమ బహుమతి రూ.11,111, ద్వితీయ బహుమతి రూ.7,777, తృతీయ బహుమతి రూ.5,555, చతుర్ద బహుమతి రూ.4,444తో పాటు షీల్డ్స్ కూడా అందజేస్తారని అన్నారు. సమాచారం కోసం 8919605849, 8186815051 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మండలస్థాయి పోటీలకు ఎంపిక

టెక్కలి : ఈ నెల 10న మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసు పురం చిన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. 10న బాలికలకు, 11న బాలురుకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఈ మండల స్థాయి పోటీలకు 14 ఏళ్ల నుంచి 17 ఏళ్ల వరకు వయసు ఉన్న విద్యార్థులు హాజరుకావాలన్నారు. వయసు ధ్రువీకరణ పత్రాలతోపాటు, ఆధార్, విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు తీసుకొని హాజరుకావాలన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: బిఇడి, బిపిఇడి, డిపిఇడి విద్యార్థులకు సంబంధించి డా బిఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం పరిధిలో కెమిస్ట్రీ పరీక్షా ఫలితాలు సోమవారం యూనివర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ డా.ఎస్.ఉదయ్ భాస్కర్ విడుదల చేశారు. బిఇడి పరీక్షకు 14 కళాశాల నుంచి 1031 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 933 మంది ఉత్తీర్ణులయ్యారు. బిపిఇడి పరీక్షకు 296 మంది హాజరు కాగా 227 మంది, డిపిఇడి పరీక్షకు 48 మంది హాజరుకాగా 25 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఫలితాలపై ఎటువంటి సందేహాలున్నా 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

కురిగాం ఆస్పత్రి సందర్శన

కొత్తూరు : మండలంలోని కురిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని టెక్కలి డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీక్యాథరిన్ సోమవారం సందర్శించారు. ఈ మేరకు ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలపై సమీక్షించారు. ఈమె వెంట వైద్యులు పెద్దిన ప్రసన్నకుమార్, సూపర్‌వైజర్ బుజ్జిబాబు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

టెక్కలి : విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఈ నెల 10న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఆ సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి నుంచి వైద్యులు సాత్విక్, జనరల్ మెడిసిన్ క్రాంతి కిరణ్, ఎముకల వైద్య నిపుణులు చైతన్యకిరణ్, శ్వాస సంబంధ వైద్యులు, శంకర్ ఫౌండేషన్ నుంచి నేత్రవైద్యులు అపూర్వ నిరంజన్ హాజరు కానున్నారని, ఈ శిబిరాన్ని టెక్కలి ఆర్‌డిఒ ఎం. కృష్ణమూర్తి ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ శిబిరాన్ని టెక్కలి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

పూర్తిస్థాయిలో యూరియా అందజేయాలి



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి- జి.సిగడాం

రైతులకు సరిపడ యూరియా అందజేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బాతువ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు సరిపడిన ఎరువులు అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ముందు చూపుతో కాకుండా నిర్లక్ష్యం వహించడం వలన ఖరీఫ్ రైతులకు అవసరమైన యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో గతేడాది 39 లక్షల టన్నులు అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాది 35 లక్షల టన్నులకు కుదించారని, జిల్లాకు ఖరీఫ్‌లో 42,200 మెట్రిక్ టన్నులు యూరియా అవసరంకాగా ప్రభుత్వం 21,644 మెట్రిక్ టన్నులు కేటాయించిందని విమర్శించారు. జూలైనెల కోటా కింద విడుదల కావాల్సిన 9600 మెట్రిక్ టన్నుల యూరియాలో 4 వేల టన్నులు మాత్రమే వచ్చాయని, ఆగస్టుకు సంబంధించి ప్రభుత్వం 12 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేయాల్సి ఉండగా 2,500 మెట్రిక్ టన్నులే చేరాయని, అందులో ప్రైవేట్ డీలర్లకు 50 శాతం చేరాయన్నారు. దీనివల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. జిల్లాకు సరిపడిన ఎరువులు కూడా వ్యవసాయ శాఖామంత్రి ఎందుకు కేటాయించలేకపోయారని ప్రశ్నించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు రైతాంగానికి సబ్సిడీలు తెగ్గోసి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టడానికి, భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టపెట్టాలని కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ఎంపిలు అవసరమైన ఎరువులు రాష్ట్రానికి కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో తేనెల అప్పలనాయుడు, రమణ, సింహాచలం, అసిరినాయుడు, ధనకోట రమణ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఉత్తమ అవార్డులు



అవార్డు అందుకుంటున్న జ్యోతి

ప్రజాశక్తి- నందిగాం

టెక్కలి ఐసిడిఎస్ పరిధిలోనే నందిగామ మండలం అంగన్వాడీ కార్యకర్తలు కె.జ్యోతి, బి.రాజ్యలక్ష్మి, నీరజ, కృష్ణ వేణిలు ఉత్తమ అవార్డులకు ఎంపిక య్యారు. వీరికి టెక్కలి ఐసిడిఎస్ పిఒ ఎస్.విద్యావతి సోమవారం ఉత్తమ అవార్డులను అందజేశారు. ఈ అవార్డులతో మరింత బాధ్యత పెరిగిందని అంగన్వాడీలు తెలిపారు.

పాఠశాలల సందర్శన

నరసన్నపేట: పాఠశాలలో ప్రతి విద్యార్థికీ ఇంటి దగ్గర చేసేందుకు హోంవర్క్ ఇవ్వాలని ఎంఇఒ శాంతారావు సూచించారు. గొట్టిపల్లి, జమ్ము ప్రాథమిక పాఠశాలలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, బోధన, మధ్యాహ్నం భోజనం పథకం తదితర అంశాలపై నిశితంగా పరిశీలించారు. అలాగే బోధనాపరమైన అంశాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

యూరియా దొరక్క అవస్థలు

ప్రజాశక్తి- నరసన్నపేట

రైతులు ఎరువు దొరక్క అష్టకష్టాలు పడుతున్నారు. ఎక్కడ యూరియా దొరుకుందో కూడా తెలియక రైతులు గందరగోళం పడుతున్నారు. సోమవారం నరసన్నపేటలో కోరమాండల్ రైతు డిపో వద్ద రైతులు బారులు తీరారు. యూరియా ఉందని సమాచారం తెలుసుకున్న నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాలకు చెందిన రైతులు తరలివచ్చారు. దుకాణంలో 377 బస్తాలు ఉండడం, ఎక్కువ మంది రైతులు రావడంతో యజమాని నిబంధనలు విధించారు. ఆధార్ కార్డు, 1బి ఉండాలని రకరకాలు ఆంక్షలు విధించారు. దీంతో వెనుదిరిగారు. యూరియా కోసం ఉదయం ఆరు గంటలకు వచ్చి తిండి తిప్పలు లేకుండా పడి కాపులు కాసామని, అయినా దొరకలేదని రైతులు ఆంగ్రహం వ్యక్తం చేశారు.



తరలివచ్చిన వచ్చిన రైతులు

'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- రణస్థలం



రణస్థలం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్‌రాజు తదితరులు

రణస్థలంలో రైతుల ఎరువుల కోతపై ఈ నెల 9న స్థానిక వైసిపి కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు రైతులతో కలసి అన్నదాత పోరు కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయం వద్ద సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సమస్యలపై జరిగే అన్నదాత పోరును విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంట సాగుకు రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని విమర్శించారు. వరి పంటకు సరిపడ యూరియా కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైసిపి మండల అధ్యక్షులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : అన్నదాత పోరు పోస్టర్‌ను వైసిపి మండల అధ్యక్షులు పోలాకి జైమునిరావు, ఎంపిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్, వైస్ ఎంపిపి ఎస్.ఆదినారాయణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, పల్లి యోగి, పెద్ద బొంతు అప్పారావు, తెంబూరు ప్రసాదరావు, బోసి రామారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: అన్నదాత పోరు పోస్టర్‌ను వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు హేమసుందర్‌రాజు, ఎంపిపి ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం



ఉపేంద్ర (ఫైల్)

ఆమదాలవలస: పట్టణంలోని డాబాలవారి వీధిలో గూడాడ ఉపేంద్ర (27) సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మునగవలసకు చెందిన ఉపేంద్ర సరుబుజ్జిలి మండలం పాలవలస గ్రామానికి చెందిన కొంచాడ సునీత అనే ఇద్దరు మగ పిల్లలు కలిగిన వివాహితను మూడేళ్ల క్రితం తీసుకొని వచ్చి పట్టణంలోని డాబాలవారి వీధిలో నివాసం ఉంటున్నాడు. మృతుడు జిల్లా కేంద్రంలోని గౌతమి జిరాక్స్ షాపులో పనిచేస్తుండగా, వివాహిత మహిళ సునీత పట్టణంలోని కిరాణా దుకాణంలో పనిచేస్తూ ఇద్దరు సహజీవనం కొనసాగించేవారని తెలిపారు. సోమవారం మృతుడు ఉపేంద్ర ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందాడని తెలిపారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తల్లి గూడాడ పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద

ఆత్మహత్య కేసులో నలుగురు అరెస్టు

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలస గ్రామానికి చెందిన నవిరి పూర్ణ అనే వివాహిత ఆత్మహత్య కేసులో సోమవారం నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్ వివేకానంద తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిట్టివలస గ్రామానికి చెందిన నవిరి సింహాచలం, పద్మ దంపతుల కుమార్తె పూర్ణను పట్టణంలోని ఐజె నాయుడు కాలనీకి చెందిన సాయిపల్లి మధుసూదనరావుతో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహం జరిపించారని, వివాహ సమయంలో అల్లుడికి కట్నకానుకలు ఇచ్చినప్పటికీ అదనపు కట్నం కావాలని భర్త, అత్తమామలు, మరిది వేధించడంతో కన్న వారింటికి చేరుకున్న పూర్ణ మనస్థాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. దీనికి కారణమైన భర్త మధుసూదనరావు, మామ లక్ష్మణ, అత్త సరస్వతి, మరిది ఈశ్వరరావు నలుగురుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. నలుగురు ముద్దాయిలను జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఎస్.బాలరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తెలిపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఒక కేసులో నెల్లూరుకు చెందిన నయ్యదుల్తాస్, బడ్డిపూడి అరుణుమార్ పర్లాఖిమిడిలో షేక్లవూర్ వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని కొనుగోలు చేసి నెల్లూరులో విక్రయించేందుకు పలాస రైల్వే స్టేషన్ వద్ద సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆయన బ్యాగ్‌ను తనిఖీ చేసి గంజాయి దొరికిందన్నారు. మరో కేసులో ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా శాంతినగర్‌కు చెందిన నుసిధరమలి రెండు కిలోల గంజాయిను నెల్లూరు తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పలాస రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేశామని అన్నారు. ఈ రెండు కేసుల్లో ఎనిమిది కిలోల గంజాయిని స్వాదీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ ఎన్.నర్సింహమూర్తి పాల్గొన్నారు.



ఆటోపై పడిన తాటిచెట్టు


తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలో రామతీర్థాలు రోడ్డు ప్రయాణికులు, స్కూల్, కాలేజీ విద్యార్థులు, వివిధ వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద రహదారికి అనుకోని రెండు తాటిచెట్లు ఉన్నాయి. అయితే సోమవారం కురిసిన వర్షానికి రోడ్డు మార్గంలో వెళ్తున్న ఆటోపై తాటిచెట్టు పడిపోయింది. అయితే ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో ఆటో డ్రైవర్ వెంటనే బయటకు దుకేశాడు. అదే సమయంలో కరెంట్ కూడా లేకపోవటం, విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం ఏమి జరగలేదని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మళ్లీ ఎప్పుడు ఏ విధంగా ప్రమాదం సంభవిస్తుందో తెలియదని, అధికారులు స్పందించి ఉన్న తాటిచెట్టు కూడా తొలగించాలని స్థానికులు నారాయణశెట్టి శ్రీనివాసరావు, కొత్తకోట్ల సింహాద్రి నాయుడు, కె.లక్ష్మి, రమణ, శ్రీనివాసరెడ్డి, టి.సతీష్ కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

పలాస : టెక్కలి నుంచి ఒడిశా రాష్ట్రం బరంపురం ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 11 టన్నుల రేషన్ బియ్యాన్ని లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద ఆదివారం కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. టెక్కలికి చెందిన సోమేశ్వర మోడరన్ రైస్ మిల్లు వే బిల్లులతో 11 టన్నులు బియ్యం బస్తాలు లారీలో ఉన్నట్లు గుర్తించారు. సోమవారం ఉదయం పౌరసరఫరాల శాఖ అధికారులు బియ్యం బస్తాలను పరిశీలించారు. పౌరసరఫరాలకు సంబంధించిన బియ్యంగా నిర్ధారించారు. సమాచారాన్ని ఉన్నతాధికారులు నివేదిక అందజేస్తామని సిఎస్ టి.తిరుపతిరావు తెలిపారు. సిఐ పి.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యం



శ్రీకాకుళం సిటీ : విద్యాకిట్లు అందజేస్తున్న హారికాప్రసాద్ తదితరులు

అక్షరాస్యతతోనే ప్రగతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 8న నిర్వహించాలని ప్రతిపాదించిందని విశ్రాంతి వయోజన విద్యాశాఖ సహాయ ప్రాజెక్టు అధికారి వావిలపల్లి జగన్నాథనాయుడు అన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యత దేశానికి పెద్ద కళంకమని దానిని తొలగించి తీరాలన్నారు. జిల్లాలో అక్షరక్రాంతి పేరుతో 1991 సెప్టెంబర్‌లో సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమం ప్రారంభమై ఆరు సంవత్సరాల పాటు నిర్విఘ్నంగా కొనసాగి జిల్లాలో అక్షరాస్య శాతాన్ని పెంచడమే కాకుండా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడానికి కూడా కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు జోగినాయుడు, స్టార్‌వాకర్స్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

శతశాతం అక్షరాస్యత లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగాలని హర్షవల్లి లయన్స్ ఇంటర్నేషనల్ డిసి, లయన్ కరణం హారికాప్రసాద్, లయన్ కరణం శోభారాణి అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ మంగమ్మ, పాలిశెట్టి మధుబాబు, చందక నిహార్, కరణం హారిక, పార్వతీశ్వరరావు, మధ్య సుమన్, లయన్ లక్ష్మణ్, లక్ష్మి కాంత్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ఎస్.ఎన్. స్వామి, అర్థశాస్త్ర విభాగాధిపతి ఉషా పద్మిని, అధ్యాపకులు సాయి కుమార్, శ్రీనివాసరావు, రాజశేఖర్, బాలరాజు, జగన్నాధరావు, ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: కవిటి భారతీయ విద్యాకేంద్రం ఆధ్వర్యాన నడుస్తున్న ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో సోమవారం అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ బల్లెడ్ కృష్ణారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎం.శిరీష, కృష్ణకుమార్, ఢిల్లీరావు, సుహాసిని, జ్యోతి, అంజలి, ఝాన్సీ, మాదికమ్మా, రాజేశ్వరి, లక్ష్మి, సరిత, నిర్మల, ధర్మారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మెళియాపుట్టి శాఖాగ్రంథాలయంలో అక్షరాస్యత దినోత్సవం కార్యక్రమంలో స్వాతి, శారద, ధర్మారావు, హరి, హేమలత, శ్వేతా పాల్గొన్నారు.



కవిటి : వర్ణమాలతో చిన్నారులు

వైసిపి విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

అసత్య ప్రచారాలతో కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న వైసిపి ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో స్త్రీ శక్తి మహాసభకు ఆయన హాజరయ్యారు. ఫ్లైఓవర్ వద్ద నుంచి మహిళలతో కలిసి భారీ ర్యాలీగా సభావేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క ఏడాదిలోనే రూ.530 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస వద్ద రూ.30వేల కోట్లతో 3200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు దిశగా కృషి కొనసాగుతోందని, దీనిని జీర్ణించుకోలేని వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా సిఎం చంద్రబాబు సహకారంతో తీర్చిదిద్దుతానని అన్నారు. గడచిన ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, మెట్ట సుజాత, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నారాయణపురం, ఆనకట్ట చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, కూటమి నాయకులు పేడాడ సూరపనాయుడు, రాష్ట్ర మెడికల్ బోర్డు సభ్యులు డాక్టర్ చాపర సుధాకర్, టిడిపి నాయకులు నూకరాజు, మురళీధర్ యాదవ్, నాలుగు మండలాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బిఆర్‌ఎయులో పిజి కోర్సులకు ప్రవేశాలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాష్ట్రంలో పలు యూనివర్శిటీలు, అనుబంధ కళాశాలల్లోని ఆర్ట్స్, సైన్స్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ సోమవారం మొదలైంది. దీనికోసం జూన్ 9 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఎపి పీజీసెట్-2025 పరీక్షలకు వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూల్ సోమవారం మొదలు పెట్టారు. ఈ ఏడాది ఈ ప్రవేశ పరీక్షను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతిలో నిర్వహించి, జూన్ 25న ఫలితాలను ప్రకటించింది. ఈ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత చెందిన వారు వెబ్‌ఆప్షన్ ద్వారా డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం శ్రీకాకుళంలో వివిధ కోర్సుల్లోకి సీట్లు పొందవచ్చునని రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత తెలిపారు. ఈనెల 15 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ రుసుం చెల్లించాలని సూచించారు. 9 నుంచి 16 వరకు ధ్రువపత్రాల అప్లోడ్‌కు, 12 నుంచి 17వరకు కళాశాల, కోర్సు ఎంపికకు, 18న వెబ్ ఐచ్ఛికాల మార్పునకు అవకాశం కల్పించారని రిజిస్ట్రార్ తెలిపారు. 20న సీట్ల కేటాయింపు, జాబితా వెల్లడి తర్వాత ఎంపికైన కళాశాలల్లో 22 నుంచి 24 వరకు రిపోర్టు చేయాలని ఆమె తెలిపారు. అయితే డా. బిఆర్‌ఎయు ఆర్ట్స్ కళాశాలలోని ఎం.కాం, ఎం.ఎ (ఎకనామిక్స్), ఎం.ఎ (రూరల్ డెవలప్మెంట్), ఎంఇడి, ఎంఎల్‌ఐసి (లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్), ఎంఎ (సోషల్ వర్క్), ఎంఎ (ఇంగ్లీష్), ఎంఎ (తెలుగు), ఎంజెఎంసి (జర్నలిజం అండ్ మాస్ మ్యూనికేషన్), ఎంఎ (తత్వశాస్త్రం)లకు ఈ వెబ్ కౌన్సిల్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అభ్యర్థులు ఆప్షన్ ఇచ్చుకోవచ్చునన్నారు. అదేవిధంగా వర్శిటీ సైన్స్ కళాశాలలోని ఎంఎస్‌సి (బయోటెక్నాలజీ), ఎంఎస్‌సి (మైక్రోబయాలజీ), ఎంఎస్‌సి (ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎంఎస్‌సి (ఆనలటికల్ కెమిస్ట్రీ), ఎంఎస్‌సి (మేథమెటిక్స్), ఎంఎస్‌సి (అప్లడ్ మేథ్మెటిక్స్), ఎంఎస్‌సి (ఫిజిక్స్), ఎంఎస్‌సి (జియో ఫిజిక్స్), ఎంఎస్‌సి (జియాలజీ)లకు ఎపిపిజిసెట్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు cets.apsche.ap.gov.in వెబ్సైట్ చూడవచ్చునని రిజిస్ట్రార్ సూచించారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ సూర్యనారాయణ

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ

ప్రజాశక్తి- పలాస

శక్తి యాప్ మహిళలకు రక్షణగా ఉపయోగపడుతుందని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ అన్నారు. సూర్యతేజ జూనియర్ కళాశాలలో శక్తి యాప్ ఆవశ్యకతపై విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మీ మొబైల్స్‌లో శక్తి యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలన్నారు. ఆపద, అత్యవసర సమయంలోనే పోలీసుల సహాయం పొందాలన్నారు. ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణకు ఈ యాప్‌ను అందుబాటులోనికి తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్ రిజిస్ట్రేషన్‌కు శక్తి బృందాలు కళాశాల, పాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. మహిళలు అత్యవసర సంయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా డయల్ 112కు ఎస్‌డిఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. శక్తి యాప్ మహిళలకు ఆయుధంగా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజ కామేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే కాశీబుగ్గ అక్షర జూనియర్ కళాశాలలో ఎస్‌ఐ నరసింహమూర్తి శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.


ఎంపికైన క్రీడాకారులు

క్రీడలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం సీనియర్ స్త్రీ, పురుషుల టెన్నీకాయిట్ జట్లను సోమవారం ఎంపిక చేశారు. జిల్లా నుంచి వివిధ పాఠశాలకు చెందిన టెన్నీకాయిట్ క్రీడాకారులు చేరుకున్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు తమ లక్ష్యాన్ని ఛేదించే దిశగా ముందుకు అడుగులు వేయాలన్నారు. అనంతరం పురుషుల జట్టుకు బి.సిద్ధార్థ, కె.ప్రవీణ్ కుమార్, బి.ఉదయ్ కిరణ్, ఎల్.రోహిత్ కుమార్ ఎంపిక కాగా, స్త్రీల జట్టు పి.శ్రావణిపాత్రో, ఎన్.దివ్య, పి.కావ్య, కె.వసుంధర ఎంపికయ్యారు. మల్లా భద్రయ్య, రాష్ట్ర టెన్నీకాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.తవిటయ్య, జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సంతోష్‌కుమార్, ఎస్.వి.జోగారావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.తారక్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు, పి.రాజేశ్వరి, ఎం.దామోదర్ పాల్గొన్నారు.


బీమా బాండ్ అందజేస్తున్న దాసరి రాజు

బీమా బాండ్ అందజేత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ఈదుపురానికి చెందిన జనసేన నాయకులు నెయ్యిల సత్యనారాయణ మృతి చెందారు. ఈయనకు జనసేనలో క్రియాశీలక సభ్యత్వం ఉంది. సోమవారం జనసేన కేంద్ర కార్యాలయం నుంచి రూ.5 లక్షల బీమా బాండ్ రావడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి బాధిత కుటుంబానికి అందజేశారు. సత్యనారాయణ సతీమణి సావిత్రిని కలిసి జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ అతని కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, జనసేన మండల అధ్యక్షులు దుర్గాసి నీలవేణిరెడ్డి, డైరెక్టర్ దుంగు భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ రాజశేఖర్, సంజు రౌలో, చింటూ బెహరా, మురళీబెహరా, రుక్మిందరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని తాళ్లవలస పంచాయతీలో చేపట్టిన పారిశుధ్య పనులను సోమవారం ఎంపిడిఒ పి.వెంకటరాజు, తహశీల్దార్ జిఎల్‌ఇ శ్రీనువాసరావు కాలువాల్లో తీస్తున్న పూడికతీత పనులు పరిశీలించారు. గ్రామాల్లో పూడికలు లేకుండా అంతా శుభ్రం చేయాలన్నారు. తాగునీరు కుళాయిలు, చేతిపంపుల వద్ద శుభ్రం చేసి బ్లీచింగ్ జల్లాలని కార్యదర్శిని ఆదేశించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్, నాయకులు ముప్పిడి శ్రీనువాసరావు, దారపురెడ్డి కూర్మరావు, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ, తహశీల్దార్ తదితరులు


పరామర్శిస్తున్న కృష్ణచైతన్య

కృష్ణచైతన్య పరామర్శ

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని కంబకాయలో వైసిపి నాయకులు పి.ప్రభాకరరావు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య సోమవారం పరామర్శించారు. ఈయన వెంట ఎంపిపి ఆరంగి మురళీధర్, ముద్దాడ భైరాగినాయుడు, జెడ్‌పిటిసి చింతు రామారావు, పొందర కూరకుల కార్పొరేషన్ విభాగ అధ్యక్షులు రాజపు అప్పన్న, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్మోహనరావు, మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బొది ఈశ్వరరావు పాల్గొన్నారు.


ఫిర్యాదు చేస్తున్న సిపిఐ నాయకులు

గొర్లెపాడు అక్రమాలపై ఫిర్యాదు

కవిటి: మండలంలోని గొర్లెపాడు పంచాయతీలోని ప్రభుత్వ భూములు, చెరువులు, పోరంపోగులు, సంత స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని సిపిఐ నాయకులు అన్నారు. సర్వే నంబరు 167 సున్నాకోల చెరువు, 105 గొర్రెగుండం చెరువు, 114/3 తవుడు బంగ్లా చెరువు, 197/1 పోరంపోగు, 136/5 సంత స్థలం, 105/14 కాలువలు, ఆర్మీ జవాన్‌ల భూములు కూడా ఆక్రమించబడ్డాయని వారు తెలిపారు. ఈ సమస్యపై సోమవారం సిపిఐ నాయకులు సాలిన నారాయణ స్వామి, పుక్కల ఆరెలమ్మ, అయినింటి లోకనాథం తహసీల్దారి మురళీమోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు.

దాడి అన్యాయం

శ్రీకాకుళం సిటీ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడికి వ్యతిరేఖంగా బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ సోమవారం ధర్నా నిర్వహించింది. ప్రపంచ ట్రేడ్ యూనియన్ పిలుపుతో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంచార భవన్ వద్ద ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావు మాట్లాడుతూ పాలస్తీనాపై దాడులు అన్యాయమన్నారు. అంతర్జాతీయంగా ప్రతి దేశం దాడులు ఖండించాలన్నారు. 6,600 మంది ఆమాయక ప్రజలు మృతి చెందారని, లక్షల్లో గాయపడ్డారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అభిమన్య, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

ఏకపక్షంగా వ్యవహరిస్తే ఉపేక్షించం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి


ఎఒపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు

అధికార పక్షానికి కొమ్ము కాస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తే ఉపేక్షించమని మండల వ్యవ సాయాధికారి మన్మధరావును వైసిపి రాష్ట్ర కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ, రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు హెచ్చరించారు. ఎరువుల అంశంపై వ్యవసాయ అధికారితో సోమవారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, రైతులతో కలిసి మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల వద్ద పంపిణీ చేయాల్సిన ఎరువును ప్రైవేటు వ్యాపారుల వద్ద నిల్వచేసి కూటమి నాయకులు చెప్పిన వారికే ఎరువులు పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మీ సమీప బంధువులకు, కూటమి నాయకులు సిఫార్సు చేసిన వ్యక్తులకు ఎరువులు అందిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అందరికీ శతశాతం ఎరువులు అందించామని ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సగంమంది రైతులకు కూడా అందించిన దాఖలాలు లేవన్నారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఎరువులను ఎటు తరలించారని ఆయనను ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారిగా ఉండి అందరికీ సమానంగా వ్యవహరించాల్సిన మీరు అధికార పక్షానికి కొమ్ము కాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు రైతులకు అందాల్సిన ఎరువుల కోసం అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, వ్యవహార శైలి మార్చుకోవాలన్నారు.

కాలువలు ఇలా.. మురుగు పారేదెలా?

ప్రబలుతున్న వ్యాధులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని ఉప్పినవలస గ్రామంలో మురుగునీరు రహదారులపై ప్రవహిస్తుంది. గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో ఉన్న కాలువల్లో దశాబ్ద కాలంగా పూడికలు తీయకపోవడంతో వాడుక నీరంతా రహదారిపై నిల్వఉండి పోతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వైరల్ జ్వరాలతో పాటు ఇతర వ్యాధులు సంక్రమిస్తున్నాయని, దశాబ్దాల క్రితం నిర్మించిన కాలువలు ప్రస్తుతం పిచ్చిమొక్కలు పేరుకుపోయి, మురుగు పారని విధంగా తయారయ్యాయని, రాత్రి వేళల్లో దోమలు విలయతాండవం చేస్తున్నాయని వాపోయారు. ముఖ్యంగా తాగునీటి అవసరాలను తీర్చే బోరు వద్ద కూడా మురుగునీరు చేరిపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోయారు. ఇదే విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినప్పటికీ చర్యలు శూన్యమని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో ఉన్న కాలువల్లో పూడికలను తొలగించాలని, అలాగే మురుగునీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పిచ్చిమొక్కల మధ్య ఉన్న కాలువ

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి


రణస్థలం రూరల్: ద్రావణాన్ని తయారు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల


ఎచ్చెర్లలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరిపంటలో పసుపు రంగు జిగురు పూసిన అట్టలను రైతులకు ఇవ్వడానికి సిద్ధం చేశారు. ఈ సందర్భంగా డిపిఎం పూజారి సత్యన్నారాయణ మాట్లాడుతూ వరి పంటలో నాట్లు వేసిన నుంచి ఆచరించాల్సిన సస్యరక్షణ పద్ధతులను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రైతులతో తప్పకుండా చేయించాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది సన్యాసిరావు, నేతింటి మీన మాట్లాడుతూ ఈ జిగురు పూసిన అట్టలను పంటలో పెట్టుకోవడం వలన పంటకు హానిచేసే సుడిదోమ, ఇతర చిన్నచిన్న పురుగుల యొక్క ఉధృతిని ముందుగానే గుర్తించి సకాలంలో నివారణ చర్యలను చేపట్టవచ్చునని తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో రైతులకు వరి పంటకు అవసరమైన కషాయాలు, ద్రావణాలను రైతుల సమక్షంలో చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడికి మార్గమని మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, యూనిట్ ఇన్‌ఛార్జి ఏసుబాబు రైతులకు సూచించారు. మండలంలోని రావాడ యూనిట్ పెదయాములపేటలో 400 లీటర్లు ద్రవ జీవామృతం, 400 లీటర్లు జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన కల్పించారు. ఈ రెండు కషాయాలు వరిలో వచ్చే రసం పీల్చే పురుగును నివారణకు వరిలో వచ్చే పొటాస్ లోపాన్ని నివారిస్తుందని, నత్రజని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, ఐసిఆర్ పి.రమణమ్మ, జయలక్ష్మి, జనార్ధన రావు, సూర్యం, వరలక్ష్మి పాల్గొన్నారు.

దళిత మహాసభ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలో ఎపి దళిత మహాసభ రణస్థలం మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ సమావేశంలో రణస్థలం, లావేరు మండలాల నుంచి దళిత నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రణస్థలం, లావేరు మండలాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎపి దళిత మహాసభ రణస్థలం మండల శాఖ అధ్యక్షులుగా పల్ల నీలయ్య, ప్రధాన కార్యదర్శిగా ముక్కు రాము, గౌరవ అధ్యక్షులుగా సాకేటి పోతయ్య, ఉపాధ్యక్షులుగా యామల గోపాల్, బోనెల పరశురాం, సామాధుల రమణ, కార్యదర్శులుగా మామిడి జగదీష్, లండ రామప్పడు, మజ్జి సుధాకర్, కుప్పిలి నవీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కుప్పిలి పైడిరాజు, కోశాధికారిగా కోండ్రు రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే లావేరు మండలశాఖ అధ్యక్షులుగా నేతల ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా గంట్లాన మారీష్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఉప్పాడ చలపతిరావు, డోకో రామకృష్ణ, బోనెల రవి, కార్య దర్శులుగా డాకి రామారావు, గంధవరపు పైడి రాజు, లుట్ట సూర్య నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి శ్రీను, కోశాధికారిగా రాకోటి ఆదినారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి సీనియర్ దళిత నాయకులు పల్ల అప్పన్న, దుక్క ఆదినారాయణ, దత్తి గోవింద, టి.సూరప్పడు తదితరులు హాజరయ్యారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

'రణభేరి జాతా' పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి : ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ... యుటిఎఫ్ ఆధ్వర్యాన చేపట్టనున్న రణభేరి జాతాను విజయవంతం చేయాలని జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బకాయి పడిని నాలుగు డిఎలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. 29 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. పిఆర్‌సి కమిషన్ వేయాలన్నారు. ఈనెల 15న ప్రారంభం కానున్న జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు పడాల గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, గౌరవాధ్యక్షులు మారం కుమారస్వామి, డొంకాన పాపారావు, చిన్నారావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

ఎరువులు సరఫరా చేయాలి

నరసన్నపేట : యూరియా, డిఎపి వంటి ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు యథేచ్ఛగా తరలించడం సరికాదన్నారు. జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా అని, జిల్లాలో రైతులు వ్యవసాయం చేసుకోవడానికి ఎరువులు సక్రమంగా అందించకపోవడం సిగ్గుచేటుని అన్నారు. రైతాంగానికి ఎరువులను సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎన్.నారాయణరావు, లవకుమార్, భాస్కరరావు, మన్మథ, వాసు, రాజు, కుమార్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మొక్కలు నాటాలి

ఇచ్ఛాపురం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని డొంకూరు జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సిహెచ్.వెంకటరావు అన్నారు. సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యాన పాఠశాల ఆవరణలో 25 మొక్కలు సోమవారం నాటారు. జామ, నేరడి, నిమ్మ, తదితర పూలమొక్కలను విద్యార్థులు నాటారు. సత్యసాయి సంఘం అధ్యక్షులు డి.తాతారావు, కార్యదర్శి సిహెచ్. ఆదినారాయణ, కో-ఆప్షన్ సభ్యులు పాపారావు, భాస్కర రావు, గురుమూర్తి, సురేష్, ఉపాధ్యాయులు గోవిందరావు, శ్రీహరి, శంకరరెడ్డి, కమలాకరరావు, స్వాతి పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ఆమదాలవలస : కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురపాలక సంఘంలోని మెట్టక్కివలసకు చెందిన సకలాబత్తుల జగదీష్, జయసుధ దంపతుల కుమార్తె ఐశ్వర్య పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని లెప్రసీకాలనీలో సుమారు 50 మంది అనాథలు, వృద్ధులు, వికలాంగులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి చిన్ను మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి మరింత మంది ముందుకు రావాలని కోరారు. బమ్మిడి రాము, బొడ్డేపల్లి శేఖర్ పాల్గొన్నారు.